దళ్లవలస విఆర్‌ఒ సస్పెన్షన్

పొందూరు : మండలంలోని దళ్లవలస సచివాలయంలో విఆర్‌ఒగా పనిచేస్తున్న జె.తవిటయ్య (తవుడు)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లలవలసలో గ్రామసభలకు హాజరు కాలేదని, గ్రామస్తులకు అందుబాటులో ఉండడం లేదని, మ్యుటేషన్ వంటి పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతోపాటు తన పరిధిని దాటి కృష్ణాపురం సర్వే నంబరులో పొజిషన్ సర్టిఫికేట్ మంజూరు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన కెల్ల ఉపేంద్ర ఫిర్యాదు చేశారు. విఆర్‌ఒపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో మూడు రోజుల కిందట క్రమశిక్షణా చర్యల కింద ఆర్‌డిఒ కార్యాలయానికి విఆర్‌ఒను సరెండర్ చేశారు. నివేదిక ప్రకారం ఆరోపణలు నిరూపణ కావడంతో సస్పెండ్ చూస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని తహశీల్దార్ తెలిపారు.

ఏజెన్సీ బంద్ విజయవంతం

- ర్యాలీలు, ధర్నాలతో నిరసనాగ్రహం
- 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్
- నేడూ కొనసాగనున్న బంద్

ప్రజాశక్తి - కొత్తూరు, మందస, మెళియాపుట్టి

గిరిజన ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి 1/70 చట్టం కారణంగా విఘాతం కలుగుతోందని, ఆ చటాన్ని సవరించాలన్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళ, బుధవారాల్లో చేపడుతున్న రాష్ట్రవ్యాప్త 'ఏజెన్సీ బంద్' తొలిరోజు మంగళవారం జిల్లాలో విజయవంతమైంది. ర్యాలీలు, ధర్నాలతో గిరిజనుల నుంచి నిరసనాగ్రహం వ్యక్తమైంది. 1/70 చట్టాన్ని సవరిస్తే సహించేది లేదని, చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. బంద్‌లో భాగంగా కొత్తూరులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. మందసలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. మెళియాపుట్టిలో ర్యాలీ నిర్వహించారు.

కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడుతూ 1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వ్యాఖ్యలపై ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలన్నారు. అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడకుండా, గిరిజనుల సమస్యలను పరిష్కరించకుండా... వారికి దన్నుగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడిన తరుణంలో వారికి ఆదరువుగా ఉన్న చట్టాన్ని సవరిస్తే భూమిపై హక్కు కూడా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, గిరిజన ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పీకర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మెళియాపుట్టిలో ఏజెన్సీ బంద్‌కు సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/70 చట్ట సవరణ వెనుక కార్పొరేట్లకు ఆదివాసీ భూములు కట్టబెట్టే కుట్ర దాగి ఉందన్నారు. జిల్లాలో పలు గిరిజన గ్రామాలు ఐదో షెడ్యూల్‌లో చేర్చలేదని, దీంతో వారు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన చెందారు. ఐదో షెడ్యూల్‌లో గిరిజన గ్రామాల్లో చేర్చడం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు అన్యాయం చేసే ఏ నిర్ణయాన్ని అయినా ప్రతిఘటించడంలో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర ధర్మారావు, సవర ఫల్గుణరావు, సవర గురునాథ్, ముకుందాపురం సర్పంచ్ భాస్కరరావు, గేదెల ధర్మారావు, పాలక శ్రీను, ఆరిక సూర్యం, సవర భావన్న తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

మందస : వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

గిరిజన భూముల ధారాదత్తానికే...

- 1/70 చట్టం సవరణకు ప్రభుత్వాల ప్రయత్నం
- మేధావులు, ప్రజాతంత్రవాదులు అడ్డుకోవాలి
- ఏజెన్సీ బంద్‌కు మద్దతు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వాలు గిరిజన భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు విమర్శించారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని సవరించాలన్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ, ఆ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాలు ఈనెల 11, 12 తేదీల్లో చేపడుతున్న ఏజెన్సీ బంద్‌కు సిపిఎం మద్దతు తెలియజేస్తోందన్నారు. 1/70 చట్టాన్ని సవరించాలన్న శాసనసభ స్పీకర్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని తెలియజేయాలన్నారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతం రాజ్యాంగం ఐదో షెడ్యూల్ కిందకు వస్తుందని, దీన్ని ధిక్కరించే అధికారం ప్రభుత్వానికీ లేదన్నారు. ఇప్పటికే పర్యాటకాభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో లభించే సహజ వనరులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎప్పట్నుంచో ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇప్పుడు 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనులకు భూమి దక్కకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని సవరించే ప్రయత్నాన్ని ప్రజాతంత్రవాదులు, మేధావులు అడ్డుకొని గిరిజనులకు అండగా నిలవాలని, ఏజెన్సీ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, జిల్లాలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో చేర్చాలని కోరారు. జిఒ నంబరు 3 అమలు చేయాలని, షెడ్యూల్ ఏరియాలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పర్మినెంట్ చేయకపోతే పోరాటం

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని మస్టర్ పాయింట్ల వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులతో ఏళ్ల తరబడి ఊడిగం చేయించుకుంటున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆప్కాస్ రద్దు పేరుతో కార్మికులను మోసగించవద్దన్నారు. పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు సకాలంలో అందించాలన్నారు. చనిపోయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, జాతీయ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నగర విస్తరణలో భాగంగా కార్మికులపై పనిభారం పెరుగుతోందని, కార్మికుల సంఖ్యను పెంచకుండా ఉన్న వారికి అదనపు పనులు అప్పగించి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవులు మంజూరు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు లేకుండా ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినప్పటికి వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణి రాజు, ఆకుల శంకర్రావు, ఆకుల మోహన్, ధనాల యుగంధర్, ధనాల.చిట్టి, అరుగుల.రాము గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి - బూర్జ, కొత్తూరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. బూర్జ, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరులోని కెజిబివి పాఠశాలలను మంగళవారం సందర్శించి ప్రచారం చేశారు. విజయగౌరి ఉద్యమ అనుభవాలను వివరించారు. ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన కలిగి నిజాయితీ గల అభ్యర్థి విజయగౌరి అని అన్నారు. ప్రభుత్వంతో ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలపై పోరాడ గల వ్యక్తి అని వివరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి జి. శారద, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ శాంతిప్రియ, కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు సిహెచ్.దేవి, యుటిఎఫ్ నాయకులు జె.చిన్నారావు, జి.మధుసూదనరావు, సిపిఎస్ కన్వీనర్ తొగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' బాధితులకు త్వరితగతిన పరిహారం

శ్రీకాకుళం : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో హిట్ అండ్ రన్ బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం అందించే విధానాలపై విస్తృతంగా చర్చించారు. నష్టపరిహారం ప్రక్రియను సరళీకరించే మార్గాలపై అధికారులతో మాట్లాడారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, డిఎస్‌పి డి.ప్రసాద్, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ఈశ్వరమ్మ, రాజాం ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

- వ్యవసాయ సేవలు సులభతరం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసి, సేవలు మరింత సులభతరం చేసే సంకల్పంతో ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడి) ఆధార్ కార్డు తరహాలో అందించనుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో సొంత భూమి కలిగిన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేయించాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పలు శాఖల జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో బయోమెట్రిక్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సేవల నాణ్యతను మెరుగుపరచాలని చెప్పారు. ఉపాధి హామీ కింద కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించి వేసవి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. స్వర్ణ పంచాయతీ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు రూపొందించాలని, అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ సర్వేలు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, కచ్చితమైన సమాచారం నమోదు చేయాలని ఆదేశించారు. భూ వివాదాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసులను తగ్గించాలని, లోకాయుక్త కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి పరిశ్రమల శాఖ జిఎం ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం

ప్రజాశక్తి - కంచిలి

సుస్మిత పాత్రో (ఫైల్ ఫొటో)

మండలంలోని డి.జి పురానికి చెందిన ఉపాధ్యాయురాలు సుస్మిత పాత్రో (44) సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుస్మిత కె.బి నౌగాం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, ఆమె భర్త దేవేంద్ర బ్రహ్మ ఒడిశా రాష్ట్రంలోని పూరియాసాయిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సుమన్ బ్రహ్మ, సూరజ్ బ్రహ్మ ఉన్నారు. సుమన్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా, సూరజ్ డి.జి పురంలోని పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దేవేంద్ర బ్రహ్మ వంశపారంపర్యంగా వస్తున్న పౌరోహిత్యం చేయడం సుస్మితకు ఇష్టం లేదు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలతో సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన సుస్మిత బెడ్ రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆమె భర్త దేవేంద్ర ఇంటి లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో భార్యను పిలిచాడు. ఆమె స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి విగతజీవిగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ లవరాజు మంగళవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

సెమినార్‌లో పలువురు వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పేదలను విస్మరించి కార్పొరేట్లకు పెద్దపీట వేసిందని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని స్థానిక కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'కేంద్ర బడ్జెట్ ప్రజలకు వరమా?, శాపమా' అన్న అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. అంబేద్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సంతోష్ రంగనాథ్ ప్రారంభోపన్యాసం చేస్తూ బడ్జెట్‌లో కొన్ని మంచి అంశాలతో పాటు లోటుపాట్లూ ఉన్నాయన్నారు. కొన్ని రంగాలకు, తరగతులకు ప్రోత్సాహకాలు ఇచ్చినా, ఇంకా చాలా చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌పై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి మేధో చర్చల ద్వారా బడ్జెట్ పూర్తి స్వరూపం సామాన్య ప్రజలకు తెలుస్తుందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు పెద్దపీట వేసి, సాధారణ ప్రజల అవసరాలను విస్మరించిందని విమర్శించారు. దిగుమతులు పెరిగి, ఎగుమతులు తగ్గుతున్నాయని ఆర్థిక సర్వే చెప్పినా ఎగుమతులను పెంచే చర్యలు బడ్జెట్‌లో లేవన్నారు. వినిమయం, ఉద్యోగిత పెంచే చర్యలు లేవన్నారు. బడ్జెట్ పరిమాణం రెట్టింపు కావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అసమానతలు తగ్గించాల్సింది పోయి పెంచేదిగా ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. కార్పొరేట్లపై పన్నుని పెంచకపోగా, తగ్గించడం సరికాదన్నారు. సూపర్ రిచ్ పన్ను, వారసత్వ పన్ను తేవాల్సింది పోయి పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు వేయడం ఈ ప్రభుత్వ స్వభావం తెలియజేస్తోందన్నారు. 1.7 శాతం మంది ఆదాయపన్ను చెల్లింపుదార్లకు పన్ను భారం తగ్గించిన ప్రభుత్వం, 25 శాతం మందిగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడాన్ని విస్మరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ రంగాన్ని విస్మరించడం దేశానికి శ్రేయస్కరం కాదని హితవు పలికారు. అన్ని తరగతుల ప్రజలు దీనిపై గొంతు ఎత్తితేనే ప్రభుత్వాలు దిగొస్తాయన్నారు. ఈ సందర్భంగా గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే వి.జి.కె మూర్తి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు అధ్యక్షత వహించగా, సహ కార్యదర్శి పి.సుధాకర్, సహాయ కార్యదర్శి కొరారి రామకృష్ణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు సతీష్, జిల్లా నాయకులు పి.తేజేశ్వరరావు, పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకులు గణపతి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, మహిళా సంఘ నాయకులు నాగమణి, ఎస్ఎఫ్ఐ నాయకులు, పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, పాల్గొన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సంతోష్ కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిత్వ హననం వంటి నేరాల వల్ల కలిగే శారీరక, మానసిక ఇబ్బందులను నివారించడానికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకూడదని చెప్పారు. బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని సూచించారు. మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దన్నారు. వాటిని నమ్మి ఒటిపిలు చెప్తే నగదు మోసపోయే అవకాశముందన్నారు. జిల్లా ఎన్ఐసి అధికారి కె.కిరణ్ కుమార్ సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సమాచార ఎన్ఐసి అధికారి విజయ్‌బాబు, నెట్‌వర్క్ ఇంజినీర్ శ్రీరామ్ ప్రకాష్, ఈ-ఆఫీస్ టెక్నికల్ అసోసియేట్ కిషోర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

- జిల్లాలో 75 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరు కానున్న 40,346 మంది విద్యార్థులు
- ఆర్ఐఒ పి.దుర్గారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ బోర్డు పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఐఒ పి.దుర్గారావు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 75 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలకు 40,346 మంది హాజరవుతారని, జంబ్లింగ్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల పదో తేదీ నుంచి ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు 113 కేంద్రాలు కేటాయించగా, తొలివిడతగా 61 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఇబ్బందుల్లేకుండా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భూ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- మందస

రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను, ఫిర్యాదులను పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక వాసుదేవ కళ్యాణ మండపంలో పలాస డివిజన్స్థాయి తహశీల్దార్లతో, విఆర్ఒలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తహశీల్దార్ కార్యాలయంలో గాని, సచివాలయంలో గాని భూ హక్కు సర్వే నంబర్లు, తదితర ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డిఒ వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని పియుసి ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డిఆర్డిఎ, సెర్ప్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వంపై ఇసిలు, సిసిలు, విఒఎలు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంఘాలుగా బలోపేతమైన వ్యక్తులుగా బలోపేతం కాగలరని చెప్పారు. ఆర్థిక బలోపేతానికి డ్వాక్రా సంఘాల్లో మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక లబ్ధిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్. రామ్మోహన్, ఎంఎంఎస్ అధ్యక్షులు అరుణ, ఎపిఎం రమణమూర్తి, సిసిలు శ్యామలరావు, ప్రభ, రమణ, కృష్ణవేణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాయితీలకు మంగళం

- పేరు ఒకరిది... దుకాణం మరొకరిది
- మద్యం సిండికేట్ల దందా!
- ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి- టెక్కలి

కల్లుగీత కార్మికులను పరోక్షంగా ఆదుకునేందుకు ప్రతి మండలానికి ఒక మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించే రాయితీకి మండలంలో మంగళం పాడనున్నారు. టెక్కలి మండలానికి కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కల్పించే రాయితీ సౌకర్యంపై ఒక మద్యం దుకాణం మంజూరైంది. రాయితీ దుకాణానికి సంబంధించిన లైసెన్స్ మంజూరుకు పది మంది వ్యక్తులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తు చేసుకున్నంత వరకే కల్లుగీత కార్మికులు అయినా... వెనుక చక్రం తిప్పుతున్నదంతా స్థానిక మద్యం వ్యాపారులు కావడం గమనార్హం. చట్ట పరిధిలో నిర్వహించాల్సిన వ్యవహారాలను, ఎక్సైజ్శాఖ నిబంధనలను టెక్కలి మద్యం వ్యాపారులు తారుమారు చేస్తున్నారు. టెక్కలి ఎక్సైజ్ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణం కేటాయింపు... రూ.30 లక్షల వరకు రాయితీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. అయితే స్థానిక వ్యాపారుల్లో కొంత మంది కల్లుగీత కార్మికుల పేరు మీద మద్యం దుకాణం లైసెన్స్ పొందేందుకు పావులు కదిపారు. ఇందులో భాగంగా టెక్కలి పట్టణంలో ఒకేసారి మూడు దుకాణాలకు లైసెన్స్ పొందిన ఓ వ్యాపారి డిడిలు తీసి ఎక్సైజ్శాఖాధికారులకు అందజేయడం గమనార్హం. దీంతో కల్లుగీత కార్మికులకు అందాల్సిన రాయితీ సొమ్మును తమ ఖాతాలో జమచేసుకునేందుకు సదరు వ్యాపారి యత్నం చేయడం విశేషం. ఇందుకు సంబంధించి ఎక్సైజ్శాఖ కార్యాలయంలో కొందరు అధికారులు సదరు వ్యాపారికి పరోక్షంగా సహకరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్దిష్ట సమయానికి దరఖాస్తులు అందజేయల్సి ఉన్నా... సమయం దాటిన తర్వాత దరఖాస్తులు అందజేసినా వాటిని అధికారులు ఆమోదించడంపై విమర్శలు దారితీస్తుంది. కల్లుగీత కార్మికులకు మంజూరైన దుకాణాన్ని వారికే అప్పగించాలని కోరుతూ ఇందులో జరిగిన అవకతవకలపైన, వ్యాపారస్తులు తీసిన డిడిలు, చెక్లపై దర్యాప్తు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. దీనిపై ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్కి వివరణ కోరగా, నిబంధనల మేరకు దరఖాస్తులు తీసుకున్నామని, కల్లుగీత కార్మికులకు కేటాయించిన దుకాణాన్ని వారికే ఆందిజేస్తామని తెలిపారు. కార్యాలయ పరిధి దాటిన తర్వాత జరిగే పరిణామాలకు తమకు బాధ్యత లేదన్నారు. తమశాఖపరంగా నిబంధనలు పాటిస్తున్నామని తెలిపారు.

17న అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యకర్తలు, మినీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులకు సమస్యలు కోరుతూ ఈ నెల 17న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి తరుపున నోడల్ అధికారికి మంగళవారం ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వేతనాలు పెంచాలని పోరాడుతున్నా... ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ప్రభుత్వం జిఒ ఇవ్వాలన్నారు. సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పించడానికి నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించినట్టు గుర్తుచేశారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రతి కేంద్రం నుంచి ఒకరు ఈ ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. నోటీసు అందజేసిన వారిలో సంఘ నాయకులు జె.కామేశ్వరి, కె.వి.హేమలత, పి.లత పాల్గొన్నారు.

నోటీసు అందజేస్తున్న నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే గొండు శంకర్

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలంలోని కుమ్మరిపేట, గార, కర్లపేట గ్రామాల్లో చేపడుతున్న సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు అత్యంత కీలకమని, గ్రామ అభివృద్ధికి ఇవి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అందువల్ల గ్రామాల్లో రహదారి నిర్మాణం, డ్రెయినేజీ వ్యవస్థను పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రాంతాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ బడగల వెంకట అప్పారావు, పేట వెంకటరమణ ఉన్నారు.

చేనేత సహకారానికి పొదుపు అవసరం

శ్రీకాకుళం అర్బన్ : ప్రాథమిక చేనేత సహకార సంఘంలో చేస్తున్న కార్మికులు మూడు నెలల పాటు శ్రమించి సంపాదించిన మజూరీలోనుంచి 8 శాతం పొదుపు చేయాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 16 శాతం అదనపు సొమ్ము అందించా మని జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి టి.జనార్ధన రావు ఒక ప్రకటనలో తెలిపారు. త్రిఫ్టు ఫండ్ పథకం అమలులో భాగంగా అలా మంజూరు చేసిన మొత్తాన్ని ఎఫ్డి రూపంలో అందజేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఏడు చేనేత సహకార సంఘాల నుంచి 240 మంది సభ్యులు ఈ పథకంలో చేరినట్టు వివరించారు. 2019 ఏప్రిల్ నుంచి 2020 సెప్టెంబరు వరకు ఆరు త్రైమాసకాలకు సంబంధించిన రూ.26,15,869 మొత్తాన్ని ఏడు చేనేత సహకార సంఘాలకు మంజూరు చేసినట్టు తెలిపారు.

స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

ఎఎల్ఒ ఆయిల్ స్ప్రేయింగ్

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎఎల్ఒ ఆయిల్స్ స్ప్రేయింగ్ను మంగళవారం నిర్వహించారు. పాత శ్రీకాకుళం, కలెక్టరేట్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి స్ప్రేయింగ్ చేపట్టారు. మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ పి.సుధీర్కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొని స్ప్రేయింగ్ చేపట్టారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

మృతదేహం

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నం నుంచి పలాస వస్తున్న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (40) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పలాస రైల్వే గేటుకు సమీపంలో రైలు పట్టాలపై వ్యక్తి పడుకొని ఉన్నాడు. దీనిని చూసిన వాహనదారులు, స్థానికులు వారించినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇంతలో ట్రైన్ ఆయన పైనుంచి వెళ్లిపోవడంతో శరీర భాగం రెండు ముక్కలుగా విడిపోయి మృతి చెందాడు. అతను సిమ్మెంట్ రంగు టీషర్టు, బ్లాక్ ట్రాక్ ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమ చేతి మోచేయిపై మహేశ్ అని ఇంగ్లీష్లో పచ్చ బొట్టు ఉంది. బ్యాగ్, దుస్తులు తప్ప మరేమి లేవు. ఆయనను గుర్తించిన వారు పలాస జిఆర్పి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ షరీఫ్ కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి- పాతపట్నం

సారవకోట మండలం వాండ్రాయిలో ఆరు మద్యం సీసాలతో చంద్రమౌళి అనే వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అక్రమ మద్యం రవాణా, నాటు సారాపై ఉక్కు పాదం మోపామన్నారు. సారా విక్రయించినా, తయారీ చేసినా టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచాతామన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.


దగ్ధమైన సామగ్రి

షాపు దగ్ధం

బూర్జ: బూర్జలోని సింహాద్రి శ్రీనివాసరావుకు చెందిన కార్పెంటర్ షాపు సోమవారం రాత్రి దగ్ధమైంది. షార్ట్సర్క్యూట్ వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో ఆధునిక యంత్రాలు, కలప అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పాలకొండ అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

పాతపట్నం : పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి హుండీ ఆదాయాన్ని ఈ నెల 12న లెక్కిస్తామని ఆలయ ఇఒ టి.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీ లెక్కింపు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకుల సమక్షంలో చేపడతామన్నారు. ఆసక్తి ఉన్న యాత్రికులు డ్రెస్ కోడ్ పాటించి లెక్కింపు రావాలని సూచించారు.

నివాళ్లర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

మాజీ జెడ్పిటిసి వీరాస్వామి మృతి

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు జెడ్పిటిసి మాజీ సభ్యులు, వైసిపి నాయకులు దున్న వీరస్వామి (68) సోమవారం రాత్రి మృతి చెందారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. వీరస్వామికి భార్య ఆరుద్రమ్మ, ఇద్దరు కుమారుల ఉన్నారు. దీంతో ఆయన అంత్యక్రియలు మంగళవారం అమలపాడులో నిర్వహించారు. గ్రామానికి సర్పంచ్గా, ఎంపిటిసిగా సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలు అందించారు. జెడ్పి నిధులతో ప్రధాన రహదారులు, తాగునీటి బోరుబావులు, సామాజిక, విశ్రాంతి భవనాలు నిర్మించి మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ దున్న బాలరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ధ్రువపత్రాల పరిశీలన

టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సదరన్ ధ్రువపత్రాలను మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో నేత్ర, ఆర్థో విభాగంలో రద్దీ కనిపించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రీ పరిశీలన నిమిత్తం హాజరయ్యారు. ఈ మేరకు పరిశీలనకు హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారుల పర్యవేక్షణలో రీ పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అందరూ ఒకేసారి చేరుకోవడంతో గందరగోళం పరిస్థితి ఏర్పడింది. అధికారుల ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు.

సీతాపురంలో అభివృద్ధి పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు తెలిపారు. ఈ మేరకు డ్రెయినేజీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2 లక్షలతో వంద మీటర్ల డ్రెయినేజీ, తాగునీటి బావి మరమ్మతులు పనులు చేపడుతున్నామని తెలిపారు. పంచాయతీ సాధారణ నిధులతో, 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రెయినేజీలు, సిమెంట్ రోడ్లు, పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. డ్రెయినేజీ నిర్మాణంతో నిల్వ ఉండే మురుగు నీరు బావిలోకి వెళ్లే అవకాశం ఉండదన్నారు. దీంతో బావి నీరు కలుషితం కాకుండా ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఢిల్లీరావు

ఎమ్మెల్యే దృష్టికి రైల్వే ఉద్యోగుల సమస్యలు

వినతిపత్రం అందజేస్తున్న రైల్వే ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

సౌత్ కోస్ట్ రైల్వేలోని ఖుర్దా డివిజన్ నుంచి విశాఖపట్నం డివిజన్కు రైల్వే ఉద్యోగులను బదిలీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఈస్ట్కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్లోని ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు రైల్వే ఉద్యోగులు వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని విన్నవించారు. సాంస్కృతి, భాష వ్యత్యాసాలు, ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విభేదాల కారణంగా తరచుగా వేధింపులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా-ఒడిశా విభజన కారణంగా పని వాతావరణం మరింత అసౌకర్యంగా మారుతోందన్నారు. వైద్య సదుపాయాల సమస్యలు, వైద్య సహాయానికి సంబంధించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. మెడికల్ రిఫరల్ కింద ఒడిశాలోని ఆస్పత్రులను సందర్శించాల్సి వచ్చినప్పుడు భాష అవరోధం, ఆరోగ్య సమస్యల గురించి సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడం కష్టతరవుతుందని వాపోయారు. తెలుగు మాట్లాడే ఉద్యోగులను ఒడిశాలోని సుదూర పట్టణాలకు బదిలీ చేసిన తరువాత, ఆంధ్రప్రదేశ్లో విద్యావ్యవస్థ భిన్నంగా ఉండటం వల్ల మా కుటుంబాలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మా కుటుంబాలు ఆంధ్రాలో ఉంటున్నాయని, మేము ఒడిశాలో ఉంటున్నామని, ఇది మా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలకు అంతరాయం కలిగించిందని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.ఉమా మహేష్, పినకాన ఈశ్వరరావు, బేపల అయ్యప్ప, జి.ఎల్.కె.రెడ్డి, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపునకు ఇంటింటా సర్వే

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసిరావు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో వికలాంగులను గుర్తించడానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించాలని జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్పపేటలో మంగళవారం చేపడుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. అంతకుముందు సింగుపురం పిహెచ్సిలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డిఎంహెచ్ఒ డాక్టర్ టి.బాలమురళీకృష్ణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్.కళ్యాణ్బాబు, వికలాంగుల శాఖ ఎడి కె.కవిత పాల్గొని పలు సూచనలు చేశారు. ఇంటింటా సర్వేలో అంగవైకల్యంతో బాధపడుతున్న సిమ్మ సాత్విక్, చల్ల హర్షితలను గుర్తించినట్టు తెలిపారు. అటువంటి చిన్నారులను గుర్తిస్తే వారి తల్లితండ్రులతో చర్చించి వైద్య అధికారుల సమక్షంలో తగు సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇందిరాప్రసాద్, ఆర్బిఎస్కె కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్, జిల్లా మేనేజర్ అప్పలనాయుడు, మెడికల్ ఆఫీసర్ చైతన్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పక్కాగా పాఠశాల సముదాయాలు

కవిటి: ఫిబ్రవరి 15న రెండో పూట పాఠశాల సముదాయాలు పక్కాగా నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ అధికారులతో, హెచ్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైమరీ, స్కూల్ అసిస్టెంట్ల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్లో ఎంఇఒ ధనుంజయ మజ్జి, హెచ్ఎం సనపల రామకృష్ణ, బెందాళం మల్లేశ్వరరావు, శివరాం ప్రసాద్పాడి, నొమితా కుమారిసాహు, జి.శాంతి, బండారు సుమలత పాల్గున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చుకోవాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న బాలాజీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యార్థుల భవిష్యత్ మెరుగుకు చర్యలు చేపడుతున్నామని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కె.మోహన్కృష్ణ అన్నారు. ట్రిపుల్ ఐటిలో మంగళవారం విద్యార్థి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్మెంట్ల కోసం విద్యార్థులు మంచి అవగాహన పెంపొందించుకోవడానికి, ప్రాక్టికల్ స్కిల్స్ మెరుగుపర్చుకోవడానికి మంచి అవకాశమని అన్నారు. ఎస్.కె.రియాజ్ హుస్సేన్ మాట్లాడుతూ టెక్నికల్ నాలెడ్జి, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్, లీడర్షిప్ క్వాలిటీస్తో సమానంగా అభివృద్ధి చేసుకుంటేనే విద్యార్థులు గొప్ప అవకాశాలను అందిపర్చుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్లుగా ఎం.రాము, రియాజ్ హుస్సేన్ వ్యవహరించారు. ఇసిఇ విభాగం ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను అసందర్శించి ప్రశంసించారు. విద్యార్థుల పరిశోధన, సృజనాత్మకత, కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఇసిఇ హెచ్డి సుధ, క్యాంపస్ ప్లేస్మెంట్ ఇన్ఛార్జి హెచ్.ఎస్.వి.వరప్రసాద్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వసుంధర పాల్గొన్నారు.

రంగస్థలం మురిసింది... నాటిక మెరిసింది

లక్ష్మణమూర్తి మాస్టారుని సన్మానిస్తున్న యువకులు

ప్రజాశక్తి- కవిటి

కళలకు పుట్టినిల్లు కవిటి మండలంలో రంగస్థలం మురిసింది. ఆ రంగస్థలంపై కళాకారుల అత్యద్భుత ప్రదర్శనతో నాటిక మెరిసింది. మండలంలోని బొరివంకలో గత మూడు రోజులుగా నిర్వహించిన బల్లెడ అనసూయమ్మ స్మారక ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల విజేతగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. సోమవారం అర్ధరాత్రి నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత? బహుమతి అందుకుంది. అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురుమేగం తృతీయ బహుమతిగా జ్యూరీ అవార్డు గెలుచుకుంది. ఉత్తమ నటుడుగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో టివి వరప్రసాద్, ఉత్తమ నటిగా జనరల్ భోగి నటి సురభి ప్రభావతి, ఉత్తమ విలన్గా నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో డి.హేమ, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా ఇంద్రప్రస్థం నాటికలో ఎన్.రవీంద్రారెడ్డి, ఉత్తమ రచనగా జనరల్ బోగి నాటికలో పి.టి.మాధవన్, ఉత్తమ దర్శకత్వం ఇంద్రప్రస్థం నాటిక దర్శకుడు ఎన్.రవీంద్రారెడ్డి, ఉత్తమ సంగీతం ఇంద్రప్రస్థం నాటిక పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో యస్.రమణ, ఉత్తమ రంగాలంకరణ ఇంద్రప్రస్థం నాటిక ఎం.భీమకుమార్, ఉత్తమ హాస్య నటుడిగా పక్కింటి మొగుడు నాటికలో యువి శేషయ్య, ద్వితీయ ఉత్తమ నటుడుగా చిగురుమేఘంలో కావూరి సత్యనారాయణ, ద్వితీయ ఉత్తమ నటిగా ఇంద్రప్రస్థం నాటికలో జి.నాగకుసుమ సాయి, ఉత్తమ క్యారెక్టర్ నటిగా దేవరాగం నాటికలో ఎస్.జ్యోతిరాణి, ప్రత్యేక జ్యూరీ అవార్డుకు నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో ఇ.టి.రాంబాబు, ఇంద్రప్రస్థం నాటికలో వి.సి.హెచ్.కె.ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంతోమంది సహకారంతో దిగ్విజయంగా ముగిసిన ఈ నాటిక పోటీలకు అన్నీతానై ముందుండి నడిపించిన బల్లెడ లక్ష్మణమూర్తి మాస్టారును గ్రామ యువత ఘనంగా సత్కరించింది.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం

నాటిక ప్రదర్శనకు హాజరైన ప్రజానీకం

రోడ్డు బాగయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో శివారు ప్రాంతమైన గొప్పిలి రంపకాన మధ్య ఆర్అండ్బి రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు నిండా ఎక్కడపడితే అక్కడ అడుగు లోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు రంపకాన నుంచి లొత్తూరు రిజర్వాయరు వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా మారింది. అధికారులు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రహదారులు మరమ్మతులపై దృష్టిసారిస్తున్నా తప్ప దూర ప్రాంతాల్లోని రహదారులు మరమ్మతులపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న గొప్పిలి రోడ్డు

నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు రోడ్డు దుస్థితిపై ఆవేదన చెందుతున్నారు. ఆర్అండ్బి అధికారులు దృష్టి సారించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్బి జెఇ ఎన్.నాయుడు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించాక రహదారి పనులు ప్రతిపాదనలు పంపామని, ఈ నెలలోపు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పిఎం నుంచి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం ఐరిస్ స్కూల్ విద్యార్థి లకినాన రూహాన్ సాయి, బూర్జ కెజిబివి విద్యార్థి గుజ్జల నిఖితకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు కరస్పాండెంట్ కొమనాపల్లి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గత సెప్టెంబరులో ప్రేరణ కార్యక్రమం ద్వారా దేశ నలుమూలల నుంచి మొత్తం 45 బ్యాచ్ల్లో బ్యాచ్కి 20 మంది మంది ఎంపికయ్యారని అన్నారు. అందులో ఐరిస్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న లకినాన రూహాన్సాయి, బూర్జ కెజిబివిలో చదువుతున్న గుజ్జల నిఖిత ఎంపికయ్యారని అన్నారు.

'స్టెమీ'తో గుండెకు భరోసా

కొత్తూరు : కొత్తూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో గుండె జబ్బులకు సంబంధించిన స్టెమీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటు లక్షణాలు, గుండె నొప్పి, దడ, స్పృహ కోల్పోవడం లక్షణాలు ప్రధానంగా గుర్తించాలని అన్నారు. మొదటి గంటలో తీసుకోవాల్సిన చికిత్స 108లో దగ్గర ఉన్న ఆరోగ్య కేంద్రం ఒక గంటలో ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.

జగన్తో వైసిపి నాయకులు

జగన్ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

తాడేపల్లి జగనన్న గృహంలో మాజీ సిఎం జగన్మోహన్రెడ్డిని విజయనగరం జిల్లా వైసిపి అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎచ్చెర్ల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను జగన్ అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కలిసిన వారిలో పిన్నింటి సాయికుమార్, జెడ్పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, జి.సిగడాం మండల కన్వీనర్ ఆబోతుల జగన్నాథం ఉన్నారు.

జగనన్న కాలనీలో వసతుల కరువు

- రహదారి లేక అవస్థలు
- తాగునీరు గగనమే

ప్రజాశక్తి- బూర్జ

గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి పేదల సొంతింటి కలలను నిజం చేసేందుకు జగనన్న కాలనీల పేరిట ఉచితంగా స్థలాన్ని కేటాయించి గృహాలను నిర్మించారు. సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. అయితే జగనన్న కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తయి... వసతులు లేమి తీవ్రంగా వేధిస్తోంది. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు పూర్తయినా, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. మండలంలోని పెద్దలంకాంలోని జగనన్న కాలనీలో సరైన రహదారి సౌకర్యం లేదు. విద్యుత్ సదుపాయం లేకపోవడంతో రాత్రుల వేళల్లో అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కాలనీ మొత్తానికి కేవలం ఒక్క కుళాయి ఉండడంతో తాగునీటికి దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. దీనిపై గృహ నిర్మాణశాఖ ఎఇ పి.లక్ష్మీనారాయణను వివరణ కోరగా... జగనన్న కాలనీలో రోడ్డు, చుట్టూ వాల్ నిర్మాణానికి పంచాయతీరాజ్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మిస్తామని తెలిపారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

రహదారి సౌకర్యం కల్పించాలి

జగనన్న కాలనీలో రహదారి లేక అవస్థలు ఎదుర్కొంటున్నాం. రాత్రి వేళల్లో భయాందోళనకు గురవుతున్నాం. ఇంటింటి కుళాయిలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

– డి.రాజేశ్వరి, పెదలంకాం

బస్సును పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

బస్సుల సామర్థ్యంపై పర్యవేక్షణ

ప్రజాశక్తి- పలాస

పలాస డిపో పరిధిలోని ఆర్‌టిసి బస్సుల కండిషన్‌పై పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు సూచించారు. పలాస డిపో గ్యారేజీలో బస్సుల మెయింటెనెన్స్ విభాగాలను మంగళవారం పరిశీలించారు. గ్యారేజీ సిబ్బందితో కలిసి షెడ్యూల్ 3 బస్సును రోడ్డు పరీక్షలు నిర్వహించారు. బస్సులు మార్గంమధ్యలో ఆగకుండా సంతృప్తికరమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందాల్సి ఉందన్నారు. ఆర్‌టసి బస్సుల్లో ప్రయాణం సురక్షితవంతమైనవి, సౌకర్యవంతమైనవి అని ప్రయాణికులు విశ్వసించేలా సేవలు ఉండాలన్నారు. డిపోలోని డ్రైవర్లతో మాట్లాడి బస్సుల్లో లోటుపాట్లు తెలుసుకొని వాటి సరిదిద్దాలని గ్యారేజ్ సిబ్బందికి తెలియజేశారు. ఆయనతో పాటు డిపో మేనేజర్ ఆర్.ఎస్.నాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పినకాన సంతోష్ కుమార్, గ్యారేజ్ ఇన్‌ఛార్జి హేమంత్‌కుమార్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాసలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ప్రధాని, పేద ప్రజల పెన్నిధి, భారతదేశ సమగ్ర సార్వభౌమాధికారి కాపాడిన ఇందిరాగాంధీ విగ్రహం గతంలో ఇందిరాచౌక్ వద్ద ఏర్పాటు చేశారని అన్నారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఆ విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించి మున్సిపల్ కార్యాలయంలో ఉంచారని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయినా ఇంత వరకు విగ్రహం ఏర్పాటు చేయలేదని, తక్షణమే స్పందించి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తెంచూరు మధుసూధనరావు, ఉప్పాడ రాజారావు, కొర్ల హేమారావు చౌదరి పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

దీన్‌దయాళ్‌కు నివాళి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

భారత రాజకీయాలకు పండిట్ దీన్‌దయాళ్ దార్శనికుడని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. దీనదయాళ్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భారత దేశ రాజకీయ వర్ణపటంపై శాశ్వత ప్రభావాన్ని చూపారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, కూటమి నాయకులు పిషిని జగన్నాథం నాయుడు, ముప్పిడి సురేష్, గొర్లె శ్రీను, సాధు మల్లేష్, మన్నె కృష్ణానందం, మన్నె వరహమూర్తి, గోవిందాసు త్రినాథ్, దన్నాన చిరంజీవి, కోళ్ల రమణ, మజ్జి రామ్మూర్తి పాల్గొన్నారు.

రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ప్రతి రైతూ ప్రభుత్వం కేటాయించనున్న గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా కలిగి ఉండాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జగన్మోహనరావు సూచించారు. మండలంలోని బొరివంక, భట్టివానిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు గుర్తింపు సంఖ్య కోసం రైతులు తమ వివరాలు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు

వజ్రపుకొత్తూరు : నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎఒ కిరణ్‌వాణి

చేసుకోవాలని సూచించారు. వివరాలు నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఫోను నంబరుతో సహా స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అంతకముందు పై గ్రామాల్లోని రబీ పంట పొలాలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ముఖ్యంగా రాగి పంటలో అగ్గి తెగులు లక్షణాల నివారణకు ట్రైసైక్లోజోల్ మందు లీటర్ నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్, ఎఇఒ బెందాళం శ్రీకళ్యాణ్, బడే యతిరాజు, అప్పన్న, గున్న సురేష్, కాళీప్రసాద్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయింపు ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయని మండల ఎఒ కిరణ్‌వాణి అన్నారు. వజ్రపుకొత్తూరు రైతు సేవా కేంద్రంలో చేపడుతున్న నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ చేపడుతుందన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో

కవిటి : అవగాహన కల్పిస్తున్న ఎడిఎ జగన్మోహనరావు

నమోదు చేసిన తర్వాత భూమి ఉన్న ప్రతి రైతులకు గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందవచ్చునన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురం, ముకుందపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమానికి పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు నిర్వహించారు. మొక్కజొన్న, రాగి తదితర పంటలపైన అవగాహన కల్పించారు. రైతులందరూ తమ సమీప రైతు సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రభావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు పుష్ప, ఝాన్సీ, సర్పంచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

అరసవల్లి ఆదాయం రూ.64,39,016

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీలకు ఆదాయం లెక్కించామని, 17 రోజుల వ్యవధిలో రూ.64,39,016 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ వై.భద్రాజీ తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో అర్చకులు, గ్రామస్తుల సమక్షంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూపంలో రూ.62,100,95, చిల్లర రూపంలో రూ.2,28,921 ఆదాయం సమకూరిందని తెలిపారు.

లెక్కిస్తున్న సిబ్బంది

వీటితో పాటు బంగారం 17.004 గ్రాములు, వెండి 1.212 కిలోలు, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా డాలర్లు 30, ఖతార్ సెంట్రల్ బ్యాంకు ఒకటి, ఒమన్ సెంట్రల్ బ్యాంకు 100 బైసా, వంటి విదేశీ కరెన్సీ లభించినట్టు తెలిపారు. ఈ లెక్కింపులో జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాద్‌పట్నాయక్, ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి తమ్మినేని రవి, శ్రీకూర్మం దేవాలయం ఇఒ గురునాథం, అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగిసన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షించారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యదాయకమని డిజిటల్ ఎల్ టు సురేష్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ఎపిఎం కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల మహిళా సమాఖ్య దగ్గర ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యాన ఉత్పత్తుల స్టాల్ పెట్టి విక్రయాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎటిఎం మోడల్‌లో వచ్చిన కూరగాయలను, బెల్లాన్ని ఇక్కడ విక్రయిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులు ఆసక్తి

విక్రయిస్తున్న సిబ్బంది

కనబరిచారని తెలిపారు. ప్రతివారమూ క్రమం తప్పకుండా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మండల కేంద్ర పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద విక్రయిస్తున్నట్లు తెలిపారు.

పరిశీలిస్తున్న గోపీబాల

'సముత్వ' సర్వే వేగవంతం

పలాస : ప్రభుత్వం నిర్దేశించిన సముత్వ సర్వేను వేగవంతం చేయాలని డివిజల్ పంచాయతీ ఇన్‌ఛార్జి అధికారి గోపీబాల సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. మండలంలోని గంగువాడ, సరియాపల్లి గ్రామాల్లో చేపడుతున్న సముత్వ సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముత్వ సర్వే గత ప్రభుత్వంలో ప్రారంభమైందన్నారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో నిలిచిపోయిందన్నారు. మళ్లీ ఈ సర్వే పున:ప్రారంభమైందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ఇంటి పన్ను ఆధారంగా హద్దులతో కలిగిన బుక్లెట్ అందజేస్తామన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఈ సర్వే చేపట్టామన్నారు. ఈయన వెంట మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకంఠరావు, కార్యదర్శులు లండ శ్రీధర్ ఉన్నారు.

పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

సిసి కెమెరాలతో నేర నియంత్రణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల నేర నియంత్రణకు ఉపయోగపడుతుందని కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు అన్నారు. ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సిసి కెమెరాను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని లొద్దపుట్టి, తులసుగాం, దర్మాపురం గ్రామాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. ప్రధాన కూడలి వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన స్థలాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి సూచించారు.

విశ్రాంత డిఎస్‌పి ఔదార్యం

ప్రజాశక్తి- కవిటి

విశ్రాంతి డిఎస్‌పి, జనసేన నాయకుడు జగతికి చెందిన ఎస్.వి.వి.ప్రసాదరావు మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. బొరివంకలోని రెండు నిరుపేద కుటుంబాలకు (తెలుకల జగ్గమ్మ, దుర్గాసి ఈశ్వరమ్మ) తన తల్లిదండ్రులు బానమ్మ రాములయ్యా ట్రస్టు పేరున రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే తన తల్లిదండ్రులు బానమ్మ - రాములయ్య పేరుమీదుగా ట్రస్టు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్, వార్డు మెంబర్ లోల్ల కింగ్, కాళీసాహు, మార్పు వెంకటేశం పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న ప్రసాదరావు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. గార, శ్రీకాకుళం మండలాల్లో పల్లె పండగ పనులు వేగంగా సాగుతున్నట్టు వివరించారు. ఈ పనులకు శంకుస్థాపన చేసి త్వరితగతిన పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల నుంచి వ్యక్తిగత వినతులతో పాటు, రోడ్లు, విద్యుత్, కాలువలు తదితర సమస్యలపై వినతులు వస్తున్నాయని తెలిపారు. అధికారులతో మాట్లాడి సాధ్యమయ్యేంత వరకు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి రజని, తదితరులు

పాత్రికేయ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జర్నలిజం విద్యార్థులకు, పాత్రికేయులకు పుస్తకాలు మార్గదర్శిగా, నిఘంటువుగా ఉపయోగపడుతుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ విసి కె.ఆర్.రజని అన్నారు. సీనియర్ జర్నలిస్టు, రచయిత దాసరి ఆళ్వార స్వామి స్వీయ రచనలో వెలువడిన 'పాత్రికేయ రంగంలో నా అనుభవాలు' టైటిల్‌తో ఉన్న 60 పుస్తకాలను మంగళవారం అంబేద్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయం, జర్నలిజం విభాగానికి అందజేశారు. వర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎన్.గోవిందరాజు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్.వి.ప్రసాదరావులు వీటిని స్వీకరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఒఎస్‌డి డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్‌లు పాల్గొన్నారు.

బెంచీలు వితరణ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులకు, వాకర్స్‌కు అందుబాటులో ఉండే విధంగా సిమెంట్ బెంచీలను స్థానికులు వితరణగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మకు మంగళవారం అందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సదాశివుని జగదీశ్వరరావు, ఉప్పాడ భాస్కరరావు దంపతులు రూ.25 వేలు విలువజేసే సిమెంట్ బెంచీలను కళాశాల ప్రిన్సిపాల్ గది బయట, మైదానంలో ఏర్పాటు చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సదాశివుని అన్నపూర్ణమ్మ, రేవతి, వై.ఎల్.నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

వసతిగృహం పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలోని అయ్యప్ప నగర్‌లో ఉన్న ప్రభుత్వ బిసి బాలురు వసతిగృహాన్ని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వసతిగృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈయనతో పాటు టెక్కలి పంచాయతీ ఇఒ జగన్నాథం ఉన్నారు.